# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-02-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు సాయంత్రం విశాఖపట్టణానికి చేరుకొనున్నారు.**

2. **ప్రజలకు తపాలా సేవలను మరింత చేరువ చేసేలా వ్యూహాత్మక విధానాలను అవలంబించాలని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ పోస్టల్ శాఖను ఆదేశించారు.**

3. **విద్యుత్ ప్రమాదాల నివారణకు ఏపీఈపీడీసీఎల్ పరిధిలో ప్రతీ జిల్లాకు కోటి రూపాయలను మంజూరు చేశామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ శాసన సభలో వెల్లడించారు.**

4. **గోదావరి డెల్టాలో ముంపు సమస్య, గేట్ల మరమ్మత్తులకు నిధులను కేటాయించామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

==========================

అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ – ఐఎఫ్ఆర్, మిలాన్–2026 కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు సాయంత్రం విశాఖపట్టణానికి చేరుకొనున్నారు. ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి విశాఖ చేరుకుని రాత్రికి అక్కడే బసచేస్తారు. రేపు ఉదయం ఐఎఫ్ఆర్ కార్యక్రమంలో పాల్గొని మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో తిరిగి ఢిల్లీ వెళ్లనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. రాష్ట్రపతితో కలిసి ఐఎఫ్ఆర్ కార్యక్రమంలో రేపు పాల్గొంటారు. ఆర్కేబీచ్ రోడ్డులో ఐఎఫ్ఆర్ సందర్భంగా నౌకాదళం ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ నిర్వహించనున్న నేపథ్యంలో ట్రాఫిక్ నిబంధనలు అమలులో ఉంటాయని అధికారులు తెలిపారు. బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్ జంక్షన్ నుంచి నేవల్ కోస్టల్ బ్యాటరీ వరకు నాలుగు రోజుల పాటు వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించామని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఒక ప్రకటనలో వెల్లడించారు. ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు.

--------------------------

శ్రీకాకుళం జిల్లా పలాస నియోజక వర్గం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పలాస, కాశీబుగ్గ ప్రాంతాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గౌతు శిరీషలతో కలిసి ఈరోజు పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, పలాసలో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నామని, దీనికి సంబంధించి తాత్కాలిక భవనాలు ఏర్పాటు చేశామని ఏప్రిల్

నుండి ప్రవేశాలు జరుగుతాయని తెలిపారు. అమృత్ భారత్ పథకం కింద పలాస, శ్రీకాకుళం రోడ్, ఇచ్ఛాపురం, నౌపడ రైల్వే స్టేషన్లలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ..

..వాయిస్... 28 సెకన్లు

---------------------------

ప్రజలకు తపాలా సేవలను మరింత చేరువ చేసేలా వ్యూహాత్మక విధానాలను అవలంబించాలని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ పోస్టల్ శాఖను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, జమ్మూకాశ్మీర్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల తపాలా శాఖకు సంబంధించిన పోస్టల్ సర్కిళ్ల కార్యకలాపాలు, ఆర్థిక పనితీరుపై ఢిల్లీలో కేంద్రమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఉత్తమ పనితీరును కనబరిచిన తెలంగాణ సర్కిల్ ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ, తపాలాశాఖా పరిధిలో దేశ నలుమూలలా పారదర్శకతను పెంపొందిస్తూ, ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేస్తూ, పోస్టల్ సేవలను మరింత త్వరితగతిన అందించాలన్నారు. “టెక్-ఫస్ట్”, “వినియోగదారుడు కేంద్రంగా సేవా విధానం”ను అవలంబించాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

---------------------------

రాష్ట్ర శాసన సభ సమావేశాలు ఈరోజు తిరిగి ప్రారంభమయ్యాయి. శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు ముందుగా ప్రశ్నోత్తరాలను చేపట్టారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇస్తున్నారు. ఆంధ్రా ఒడిస్సా సరిహద్దులో గంజాయి నియంత్రణపై అడిగిన ప్రశ్నకు హోం మంత్రి వి. అనిత సమాధానమిస్తూ... ప్రస్తుతం రాష్ట్రంలో గంజాయి సాగు, అక్రమ రవాణా నియంత్రణలో ఉందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 35 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి రవాణాను అరికట్టామని తెలిపారు. గంజాయి సాగు, రవాణాపై డ్రోన్ల ద్వారా నిఘా చేసి, అక్రమ సాగును గుర్తించి ధ్వంసం చేస్తున్నామని వివరించారు.

---------------------------

విద్యుత్ ప్రమాదాల నివారణకు ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ – ఏపీఈపీడీసీఎల్ పరిధిలో ప్రతీ జిల్లాకు కోటి రూపాయలను మంజూరు చేశామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. నియమ నిబంధనలను అనుసరించి విద్యుత్ పంపిణీ లైన్లు వేస్తున్నామని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించామని వీటిపై అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

రాష్ట్ర బడ్జెట్ 2026-27లో పరిశ్రమల రంగానికి ప్రాధాన్యతనిస్తూ “ఒక కుటుంబం -- ఒక పారిశ్రామికవేత్త” లక్ష్యంతో కేటాయింపులు చేసినట్లు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని యువతను ఉద్యోగార్థులుగా కాకుండా ఉపాధి సృష్టించే వారిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఎంఎస్ఎంఈ క్లస్టర్ అభివృద్ధికి 111.82 కోట్ల రూపాయలు, మౌలిక సదుపాయాలకు 100 కోట్ల రూపాయలను కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే 15 పార్కులు సిద్ధమై, మరిన్ని నిర్మాణ దశలో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

గోదావరి డెల్టాలో ముంపు సమస్య, గేట్ల మరమ్మత్తులకు నిధులను కేటాయించామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాలలో భాగంగా ధవళేశ్వరం బ్యారేజ్ గేట్ల పునర్నిర్మాణంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, ధవళేశ్వరం బ్యారేజ్ కి కొత్త గేట్ల ఏర్పాటుకు 150 కోట్ల రూపాయల నిధులిచ్చామని తెలిపారు. గోదావరి డెల్టా కాలువల్లో నీటి సరఫరాకు అంతరాయం లేకుండా సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్టాప్ లాగ్ గేట్లను వినియోగిస్తూ, దశలవారీగా పనులు చేపడతామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్.. 25.. సెకన్లు

---------------------------

పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా నులి పురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని రేపు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయస్సు గల వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో సమన్వయ సమావేశాన్ని ఇప్పటికే నిర్వహించామని, ఇందుకు సంబంధించి అన్ని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల, కళాశాలల్లో మాత్రలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలు తలెత్తకుండా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని కలెక్టర్ సూచించారు.

---------------------------

యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందని అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. అనంతపురంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న SAAP LEAGUE- 2026 జిల్లా స్థాయి చదరంగం పోటీల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తో కలిసి ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

=====================